ఆఫీసుకెళ్ళి డల్‌గా తన సీట్లో కూర్చున్నాడు. ఆలోచించగా సీత చెప్పింది కరెక్టే అనిపించింది బుచ్చిబాబుకి. నేడు ఇంకాస్త ధైర్యం తెచ్చుకోవాలి అనుకున్నాడు. ఈలోగా ప్యూన్ వచ్చి బాస్ పిలుస్తున్నట్టు చెప్పాడు.

బుచ్చిబాబు ఏకాంబరం క్యాబిన్‌లోకి వెళ్ళాడు "రావోయ్ రా..నా డింగిల డిఫ్ఫీ! నాటింగాల టుంగి" అన్నాడు ఏకాంబరం చిరునవ్వు నవ్వుతూ.

"ఏంటిసార్ మీరీమధ్య నన్ను మరీ ఇదిగా పొగిడేస్తున్నారు," సిగ్గుపడుతూ అన్నాడు బుచ్చిబాబు .

"మరి పొగడనా? నీవల్లేగా నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అన్నట్టు చెప్పడం మరిచానయ్యోయ్. ఆ కిల్లారికిత్తిగాడు అదే.....ఆ మినిస్టర్ మిన్నారావ్ గాడి దగ్గరికి మా బంధువులబ్బాయ్‌ని పంపించాను. మళ్ళీ అదే న్యూస్‌పేపరు ఇచ్చి పంపించాను. ఈసారి కూడా ఆ ఉపాయం భలేపనిచేసిందయ్యోయ్. దెబ్బకి ఆడికి ప్రమోషనిప్పిస్తానని చెప్పాట్ట. ఇప్పుడే హైదరాబాదు నుంది మావాడు ఫోన్‌చేసి చెప్పాడు" సంబరంగా అన్నాడు ఏకాంబరం .

బుచ్చిబాబు కంగారుగా ఆయనవంక చూశాడు.

"సార్! మీరా విషయానికి అంత పబ్లిసిటీ ఇవ్వకండి సార్. అనవసరంగా లేనిపోని గోల. అంతా ఆ  న్యూస్ పేపర్ పట్టుకుని మినిస్టర్ మిన్నారావుని హైరానా పెడతారు......"

"పెడ్తేపెట్టారు లేవయ్యా లింగల టింగిగాడు ఆ మాత్రం అందరికి ఉపయోగపడితే మంచిదే కదా! అసలు నాకు ప్రమోషన్‌కి వేకెన్సీ వచ్చినప్పుడు నేను పాతపేపర్ని పట్టుకుని మళ్ళీ వాడిదగ్గరకెళ్తా....."

బుచ్చిబాబు ఈ న్యూస్ పేపరు ప్రహసనం ఎక్కడికి దారి తీస్తుందోనని చాలా భయపడ్డాడు.

"ఇంతకీ మీరు ఎందుకు పిలిచారు సార్?" టాపిక్ మార్చేస్తూ అడిగాడు బుచ్చిబాబు.

ఏకాంబరం డ్రాలోంచి ఓ సీల్డు కవరు తీసాడు "ఇది అగర్వాల్ అండ్ కంపెనీకి తీస్కెళ్ళి అగర్వాల్‌కి ఇచ్చెయ్" బుచ్చిబాబు చేతికి కవర్ అందించాడు.

"ఆంతేనా సార్!" అడిగాడు బుచ్చిబాబు.

"ఆ కవర్ ఓపెన్ చేసి చదివిన తరువాత ఏమయినా మెస్సేజ్ ఇస్తే నాకు చెప్పు. లేదా తిన్నగా ఆఫీసుకొచ్చేయ్."

"అలాగే సార్"

బుచ్చిబాబు వెనక్కి తిరిగాడు.

"ఇదిగో మాట?"

బుచ్చిబాబు మళ్ళీ వెనక్కి తిరిగి ఏకాంబరంవైపు ప్రశ్నార్ధకంగా చూసాడు.

"నువ్వేమీ కంగారుగా ఆఫీసుకు పరుగెత్తుకు రానక్కర్లా. ఆఫీసు ఎప్పుడూ వుండేదే... ఎక్కడికీ పారిపోదు. హాయిగా కాళ్ళీడ్చుకుంటూ మెల్లగా రా" నవ్వుతూ అన్నాడు ఏకాంబరం .

బుచ్చిబాబు బాధగా మొహం పెట్టాడు "సార్! నేనెప్పుడైనా అలా చేసానా సార్" అన్నాడు.

ఏకాంబరం పక పకా నవ్వాడు "ఎప్పుడు చేయలేదనే ఇప్పుడు చేయమంటున్నా"

బుచ్చిబాబు తెల్ల మొహం వేస్కుని చూసాడు.

"నేనేం వ్యంగ్యంగా అనడం లేదయ్యా బాబూ ... నిజంగానే అంటున్నా! పాపం! నా ట్రాన్స్ఫర్ చేయించి పెట్టావ్. నీకు ఆ మాత్రం కన్సెషన్ ఇవ్వకపోతే నన్ను అందురూ లత్కోరిఇత్కు అనరూ?"

"లత్కోరికిత్కా? అదేంటిసార్?" నోరు తెరిచాడు బుచ్చిబాబు .

"అది కిల్లారికిత్తి కంటే నీచమైన తిట్టులే.. సరే నువ్వింక వెళ్ళు!"

బుచ్చిబాబు వెనక్కి తిరిగి చూసాడు.

"ఏమయ్యోయ్! ఆఫీసుకు తిరిగొచ్చేటప్పుడు నీ పర్సనల్ పనులు ఏమయినా వుంటే చూస్కుని మెల్లగా రా.. మరేం పర్లేదు" వెనుక నుండి అరిచాడు మేనేజర్ ఏకాంబరం .

"సిల్లీ ఫెలో"

మనసులో అనుకుని క్యాబిన్లోంచి బయటికెళ్ళి పోయాడు బుచ్చిబాబు.

0 0 0

అగర్వాల్ బుచ్చిబాబు ఇచ్చిన కవర్ చింపి అందులోని మ్యాటర్ని చదివాడు.

"మీదీ ఏకాంబర్యం ఉత్తర్యంసదివిన్యాం .... మేము ఆలోచిస్తున్యాం!" అన్నాడు అగర్వాల్ బుచ్చిబాబు మొహంలోకి చూస్తూ.

బుచ్చిబాబు అలాగే అన్నట్టు తల ఊపి అక్కడే నిల్చున్నాడు.

"మేం అలోసిస్తున్యాం అని సెప్పిన్యాం! మనమెందుకు ఇక్కడ నింసున్యాం?" అడిగాడు అగర్వాల్.

"మనం నిల్చోలేదు సార్! మీరు కూర్చున్నారు... నేను నిల్చున్నాను."

"అదే ... అదే ఎందుక్కు నిల్సున్యాం?"

"మీరేమయినా చెప్తారని మ్యావ్"

"క్యా?" నొసలు చిట్లించాడు అగర్వాల్.

బుచ్చిబాబు నాలుక కొరుక్కున్నాడు.

"అదే .... మీరేమయినా మెస్సేజ్ చెప్తారనీ ..." అన్నాడు.

"మేం ఆలోసిస్తున్యాం అని సెప్పిన్యా కదా! మేం ఏకాంబర్యంతో తర్వాత మాట్లాడత్యాం!"

"అలాగా? అయితే నేను వెళ్ళిపోవచ్చు కద్సార్?" అడిగాడు బుచ్చిబాబు.

“హు....జరూర్!” అన్నాడు అగర్వాల్ ఫైళ్ళలో తల దూర్చేస్తూ.

0 0 0

ఎలాగు ఏకాంబరం ఆఫీసుకు తీరుబడిగా రమ్మన్నాడు కదా అని బుచ్చిబాబు ఇంటివైపు బయలుదేరాడు. ఇంట్లో కాఫీ తాగి కాస్సేపు సీతతో కబుర్లేసి రిలాక్స్ అవుదామని అనుకున్నాడు.

ఇల్లు అంతదూరంలో వుండగానే వీధి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు బుచ్చిబాబు .

అబ్బ సీత కెందుకింత అజాగ్రత్త? వీధి తలుపులు తెరుచుకుని ఎందుకుంది? ఇంటిలో ఎవడైనా దూరితే? అనుకున్నాడు బుచ్చిబాబు .

ఇంటి దగ్గరకొచ్చాక లోపలి నుండి ఓ మగ గొంతు వినిపించింది బుచ్చిబాబుకి.

సీతకి ఈ ఊళ్లో తెలిసినవాళ్ళెవరున్నారబ్బా! అందులో మగవాళ్ళు

బుచ్చిబాబులో మగవాడి కుండే అందోళన ... కొద్ది క్షణాలు!

లోపలికి వెళ్ళిన బుచ్చిబాబు కంటికి సోఫాల్లో ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుతున్న మోహన్, సీత కనిపించారు.

మోహన్‌ని చూసి బుచ్చిబాబు రిలాక్స్ అయ్యాడు గానీ అంతలోనే ఆ టైంలో అతనక్కడ వున్నందుకు కన్‌ఫ్యూజ్ కూడా అయ్యాడు.

“అదేంటీ? నువ్వాఫీసుకు వెళ్ళలేదా?” అడిగింది సీత బుచ్చిబాబుని చూస్తూనే.

“వెళ్ళాను!” అన్నాడు బుచ్చిబాబు.

“వెళ్ళావా?” ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు మోహన్. ‘నువ్వు అఫీసుకు రాలేదనుకున్నా... హఠాత్తుగా అఫీసుకెందుకు రాలేదా .. నీకు ఒంట్లో గానీ బాగోలేదేమోనని చూసి పోదామని వచ్చా! కానీ సీతగారు నువ్వు ఆఫీసుకు వెళ్ళావని చెప్పారు”

“నేను ఆఫీసుకే వాళ్ళాను. కానీ అగర్వాల్ కంపెనీకి వెళ్ళి ఏదోకవర్ అందజేసి రమ్మని బాస్ నన్ను పంపించాడు. ఆ విషయం నీకు తెలీదేమో కదా!” చెప్పాడు బుచ్చిబాబు .

“అవునవును.. తెలీదు!” తొట్రుపాటు పడుతూ అన్నాడు మోహన్.

“ఎలాగూ దార్లోనే కదా... అక్కడ అఫీసులో క్యాంటిన్ కాఫీ త్రాగలేక చస్తున్నా... ఇంటి దగ్గర చిక్కని కాఫీ త్రాగి వెళ్దామని వచ్చా! సీతా.... మా ఇద్దరికీ వేడి వేడికాఫీ పట్రా...” అన్నాడు బుచ్చిబాబు.

రెండు నిముషాల్లో సీత ఇద్దరికి కాఫీ తెచ్చి పెట్టింది.

“నీకో?” అడిగాడు బుచ్చిబాబు .

“వద్దు.....ఇందాకే త్రాగాను”అంది సీత .

“ఫర్వాలేదు సీతగారు....నాకు కంపెనీ ఇవ్వడం కోసం త్రాగండి!” అన్నాడు మోహన్ చనువుగా.

“మీకు బుచ్చిబాబు కంపెనీ ఇస్తున్నాడుగా” అంది సీత ఎక్స్‌ప్రెషన్‌లెస్ ఫేస్‌తో.

“పోనీ నాకు కాకపోతే మా ఇద్దరికీ కలిసి కంపెనీ ఇవ్వండి”

“అబ్బే......వద్దండీ కాస్సేపయ్యాక నేను భోంచెయ్యాలి”

“కొద్దిగానేనండీ.....ఒక ఖాళీ కప్పు తెచ్చుకోండి”

“సీతా! కాస్త తాగొచ్చు కదా?” ఆ డిస్కషన్ ప్రొలాంగ్ చేయడం ఇష్టం లేక కాస్తవిసుగ్గా అన్నాడు బుచ్చిబాబు.

సీత లోపలి నుండి ఖాళీ కప్పు ఒకటి తెచ్చుకుంది అయిష్టంగానే.

“ఇలాతే!” చెయ్యి చాపుతూ అన్నాడు బుచ్చిబాబు .

సీత కప్పుని బుచ్చిబాబుకి అందించేంతలో మోహన్ ఆమె చేతిలోంచి చటుక్కున లాక్కున్నాడు.

“మీరిద్దరూ ఎప్పుడూ ఫిఫ్టీ ఫిఫ్టీ పంచుకుంటూనే వుంటారు..... కాస్త మాలాంటి వాళ్ళకి కూడా ఆ అవకాశం ఇవ్వూ” అన్నాడు మోహన్ బుచ్చిబాబుతో.

అతని అతి చనువు ఆ ఇద్దరికీ నచ్చలేదు. ముఖ్యంగా బుచ్చిబాబుకి. మోహన్ సగం కాఫీని ఖాళీకప్పులోకి వంచి సీతకి ఇచ్చాడు. బుచ్చిబాబు ఆముదం తాగినట్టు మొహము పెట్టాడు.

ముగ్గురూ కాఫీ త్రాగాక “ఇంక మనం ఆఫీసుకేళ్దామా?” అన్నాడు బుచ్చిబాబు.

“అప్పుడే అంత కంగారేమిటోయ్” అన్నాడు మోహన్.

“నాకు చాలా పనుంది!” బుచ్చిబాబు సోఫాలోంచి లేచాడు.

మోహన్ కూడా లేచాడు. ఇద్దరూ ఆఫీసుకెళ్ళిపోయారు. ఆఫీసు వెళ్ళగానే మోహన్ తన సీట్లో కూర్చున్నాడు. బుచ్చిబాబు మాత్రము ఏకాంబరం క్యాబిన్‌లోకి వెళ్ళాడు.

“రావోయ్ రా........ ఇంతకీ అలత్కోరు కిత్తుగాడున్నాడా?” బుచ్చిబాబుని అడిగాడు ఏకాంబరం .

“ఉన్నాడు సార్! మీరిచ్చిన కవర్ చింపి చదివాడు సార్” చెప్పాడు బుచ్చిబాబు .

“ఏమన్నాడు?”

“తర్వాత మీతోనే ఫోన్‌చేసి మాట్లాడతానన్నాడు సార్”

“సరే....నువ్వెళ్ళి నీపని చూస్కో”.

“సార్....నిన్న సాయంత్రం ఏవో అర్జంట్ ఫైళ్ళు ఉన్నాయన్నారు అవి ఇవ్వండి సార్.... పూర్తి చేసి ఇచ్చేస్తా”

“అవి మోహన్‌కి పొద్దునే ఇచ్చేశా! నువ్వు అగర్వాల్ కంపెనీకి వెళ్ళగానే మోహన్‌ని లోపలికి పిలిచి నివ్వు అర్జంట్ పనిమీద అగర్‌వాల్ కంపెనీకి వెళ్ళావని చెప్పి ఆ ఫైళ్ళు అతనికి అప్పచెప్పా....నువ్వేం వర్రీ కాకు.... ఆ పని అతను చేస్తాడ్లే!” బుచ్చిబాబు ఉలిక్కిపడ్డాడు.

“నేను అగర్వాల్ కంపెనీకి వెళ్ళినట్టు మోహన్‌కి తెలుసా?” అని ఆడిగాడు

అయోమయంగా.

"తెలుసు....నేనే చెప్పా.....ఏం?" ఆశ్చర్యంగా అడిగాడు ఏకాంబరం .

"ఏం లేదు సార్.....ఏంలేదు!" అంటూ క్యాబిన్‌లోంచి బయటకి వచ్చేసి అక్కడే నిలబడి ఆలోచించసాగాడు బుచ్చిబాబు .

"నేను అగర్వాల్ కంపెనీకి వెళ్ళినట్టుగా మోహన్‌కి ముందే తెలిస్తే మరి ఇంటికి ఎందుకు వచ్చినట్టు......ఎందుకు?ఎందుకు??ఎందుకు???"

0 0 0

ఆఫీసు నుండి రాగానే మొహం కడుక్కుని వంట గదిలోకి వెళ్ళాడు బుచ్చిబాబు.

అక్కడ సీత బెండకాయలు తరుగుతోంది.

"ఏంటీ?ఈవేళ వంటలో నాకు సాయం చేస్తున్నావు?" సీత బుగ్గమీద చిటికె వేస్తూ అడిగాడు బుచ్చిబాబు .

"ఊ......మరీ ఇంట్లో ఊరికే కూర్చుని ఉంటే నాకు తోచడము లేదు."

"అలాగైతే రోజు వంటపని నువ్వే చేయవచ్చుగా! నీకూ తోస్తుంది....నాకూ ఈజీగా ఉంటుంది".

"ఊహూ...।అలా కుదర్దు! తోచడానికి నేను వంట పనే చేయనక్కర్లా!"

"మరేం చేస్తావ్?"

"కూర్చో చెప్తా!"

బుచ్చిబాబు సీత ఎదురుగా పీట వేస్కుని కూర్చున్నాడు.

"చెప్పు"

"నేను కూడా ఉద్యోగం చేస్తా" బెండకాయలు తరగడం ఆపి బుచ్చిబాబు మొహంలోకి చూస్తూ అంది సీత .

"నువ్వా? ఎక్కడ??"

"ఏమో.....చూడాలి! ఎక్కడైనా వేకేన్సీ ఉంటే అప్లయ్ చేస్తాను"

"నీ ఇష్టం"

"నా ఇష్టం అని ఊర్కుంటే సరిపోదు. నువ్వు ప్రయత్నించు! పెళ్ళాం మాటయితే మొగుడు వినడుగానీ ప్రేయసీ మాటా గర్ల్‌ఫ్రెండ్ మాటా అయితే వింటాడుగా?" నవ్వుతూ అంది సీత .

"అబ్బా మళ్ళీ చెప్పడం మొదలుపెటావా? నేను వెళ్తా!" పీటమీద నుండి లేవబోయాడు.

“లేవకు కూర్చో కాఫీ పెట్టిస్తా!” అంటూ క్రింద నుండి లేచి కాఫీ పెట్టి బుచ్చిబాబుకి ఒక కప్పు ఇచ్చి తనో కప్పు తీసుకుంది.

బుచ్చిబాబు కాఫీ సిప్ చేస్తుండగా సీత అడిగింది “ ఆ మోహన్ నీకు బాగా క్లోజ్ ఫ్రెండా?”

“క్లోజ్ అంటే మరీ క్లోజ్‌కాదు. ఏదో చదువుకునేటప్పుడు......” అన్నాడు బుచ్చిబాబు .

“నీ ఫ్రెండ్‌ని అంటున్నానని ఏమీ అనుకోకు అతని చూపులూ, అతని వాలకం నాకు నచ్చలేదు. పొద్దున అతను వచ్చిన పది నిముషాలకే నువ్వొచ్చావు బ్రతికిపోయాను”.

తాను లేడని తెలిసే మోహన్ వచ్చాడని సీతకి బుచ్చిబాబు చెప్పలేదు.

అతను అలా రావడం బుచ్చిబాబుకి ఇంకా పజిల్డ్‌గానే వుంది. అతని ప్రవర్తన గురించి తను ఓ కన్‌క్లూషనకి రాకుండా సీతకి చెప్పడం బుచ్చిబాబుకి ఇష్టం లేదు.

0 0 0

“ఒసేవ్ వెంకటీ.....” పిలిచాడు మినిస్టర్ మిన్నారావు.

“ఏటీ?” లోపలి నుండి హాల్లోకి వస్తూ అడిగింది వెంకటలక్ష్మి

“ఈయాల ఏం వండుతున్నావ్?” మినిస్టర్ మిన్నారావ్ అడిగాడు.

“కోడికూర ఎపుడు సేసి చారెడ్తున్నా!”

“సీ.....దీనెమ్మ! ఈ కోళ్ళూ, పందులూ తిని తెగ ఇసుగొచ్చేసిందే! ఓ పని సెయ్యి”

“ఏటి?”

“ఈయాల ఉప్పుసేపల ఏపుడు సేసి పప్పుచారు కయి. అదిరిపోద్ది” కులాసాగా కాళ్లూపుతూ అన్నాడు మినిస్టర్ మిన్నారావ్ .

వెంకటలక్ష్మి కిసకిసా నవ్వేసింది.

“ఓ....అట్టాగేలే.....అయినా ఈయల తీరుబడిగా కూకున్నావేటి? ఓపెనింగ్సూ గట్రా ఏమీ లేవా?”

“ఇప్పటిదాకా అయితే లేవే....ఎవడయినా వస్తాడేమో అనిసూస్తన్నా!”

“సరే...నేను పోయి వంట సేస్కుంటా!”

వెంకటలక్ష్మి లోపలికి వెళ్ళిపోయింది.

మినిస్టర్ మిన్నారావ్ ఓ పావుగంటసేపు న్యూస్‌పేపర్ అటూఇటూ తిప్పాడు.

ఇంతలో పనివాడు లోపలికి వచ్చి “సార్....మీ కోసం ఎవరో వచ్చాడు”” అని చెప్పాడు.

“ఓపెనింగ్స్ కోసమే వచ్చుంటారు. నాకు తెలుసు. ఎవరో ఒకరు వస్తారని తొరగా లోపలికి

పంపించు" సంబరంగా అన్నాడు మినిస్టర్ మిన్నారావ్ .